# ఎస్టీపీ పనులను ఏకకాలంలో పూర్తి చేయాలి

**ఎస్టీపీ పనులను పరిశీలించిన ఎండీ దానకిశోర్**



సిటీబ్యూరో, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ ) : తుది దశ నిర్మాణంలో ఉన్న ఎస్టీపీల అన్నీ పనులను ఏకకాలంలో పూర్తి చేయాలని ఎండీ దానకిశోర్ అధికారులను ఆదేశించారు. ఫతేనగర్, మియాపూర్ పటేల్ చెరువు మురుగునీటి శుద్ధి కేంద్రాల్ని మంగళవారం ఆయన సందర్శించారు. మొదటగా ఫతేనగర్ (133 ఎంఎల్‌డీ సామర్థ్యం) ఎస్టీపీని ఎండీ దానకిశోర్ సందర్శించి.. అక్కడ జరుగుతున్న పనులు పరిశీలించారు. ఎస్టీపీ నిర్మాణం తుది దశలో ఉన్నందున ప్రధాన పనులతో పాటు చిన్న పనుల పైనా దృష్టి సారించాలని ఎండీ చెప్పారు. పనులు నిరాటంకంగా జరిగేందుకు అదనపు కార్మికుల బృందాలను సమకూర్చుకోవాలన్నారు. వీరంతా మూడు షిఫ్టుల్లో పని చేసేలా చూడాలని సూచించారు. రాత్రి వేళల్లో పనులు సజావుగా సాగేందుకు లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. సివిల్ పనులు, అటు యంత్రాల బిగింపు పనులు సమాంతరంగా చేపట్టాలన్నారు. తర్వాత మియాపూర్ పటేల్ చెరువు (10 ఎంఎల్‌డీ సామర్థ్యం) ఎస్టీపీ వద్దకు వెళ్లి.. రెండు ఎస్టీపీ ప్రాంగణాల్లో అంతర్గత రహదారులు, సుందరీకరణ, పెయింటింగ్ పనులు వేగంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. పని జరిగే ప్రదేశంలో కార్మికులందరూ తగిన రక్షణ చర్యలు పాటించేలా చూడాలని ఎండీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఈడీ డాక్టర్ ఎం. సత్యనారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, ఎస్టీపీ సీజీఎం రఘు, సుజాత, జీఎంలు, ఇతర అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎనీడెస్క్ లింక్‌ను.. ఓపెన్ చేయకండి

సిటీబ్యూరో, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): ఎలక్ట్రిసిటీ బిల్లు పెడింగ్‌లో ఉంది.. వెంటనే చెల్లించాలంటూ ఒక రిటైర్డు ఉద్యోగికి మెసేజ్ పంపించిన సైబర్‌నేరగాళ్లు ఆయన బ్యాంకు ఖాతా నుంచి రూ. 10 లక్షలు కాజేశారు. పోలీసుల కథనం ప్రకారం.. జియాగూడకు చెందిన బాధితుడి సెల్‌ఫోన్‌కు ఎలక్ట్రిసిటీ బిల్ డ్యూ ఉన్నదంటూ ఒక మెసేజ్ వచ్చింది. ఆ తర్వాత అతడి వాట్సాప్ నంబర్‌కు ఒక లింక్ పంపించి, దాని ద్వారా మీరు వెంటనే బిల్లు చెల్లించాలంటూ సూచించారు. దీంతో బాధితుడు ఆ లింక్‌ను క్లిక్ చేయగానే ఎనీడెస్క్ యాప్ డౌన్‌లోడ్ అయ్యింది. అందులో ప్యాన్ కార్డు నంబర్, బ్యాంకు వివరాలు పొందు పరచాలని సూచించడంతో.. ఆ వివరాలను పూరించాడు. దీంతో బాధితుడి బ్యాంకు వివరాలను ఎనీడెస్క్ యాప్ నుంచి సేకరించిన సైబర్‌నేరగాళ్లు అతడి బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.10 లక్షలు కొట్టేశారు. ఎనీడెస్క్ లింక్‌ను ఓపెన్ చేయవద్దని ఈ సందర్భంగా పోలీసులు సూచించారు. బాధితుడి ఫిర్యాదుతో హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## ప్రియుడి ఆత్మహత్య.. యువతి బలవన్మరణం

కొండాపూర్, అక్టోబర్ 3 : ప్రేమ పెళ్లిని కుటుంబ సభ్యులు నిరాకరించడంతో ప్రియుడు ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న యువతి బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన గచ్చిబౌలి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జర్నలిస్ట్ కాలనీలో నివాసముండే బల్విందర్ సింగ్ కూతురు నేహా(19) నానక్‌రాంగూడలోని ఓ బేకరీలో సేల్స్ గర్ల్‌గా పని చేస్తున్నది. అక్కడే పని చేస్తున్న సల్మాన్ అనే యువకుడిని ప్రేమిస్తున్నానని, అతడితో పెండ్లికి ఒప్పుకోవాల్సిందిగా కోరింది. కుటుంబ సభ్యులు పెండ్లికి నిరాకరించడంతో సల్మాన్ తాను నివాసముండే బాలాపూర్ సమీపంలోని వెంకటాపురంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న నేహ మంగళవారం ఉదయం ఇంట్లోని తన గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. నేహ సోదరి మేఘ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## 6 నుంచి ఫొటో ట్రేడ్ ఎక్స్ పో



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఫొటోగ్రాఫర్ల సంఘం నాయకులు

మంచాల, అక్టోబర్ 3 : తెలంగాణ రాష్ట్ర ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 6,7,8 తేదీల్లో నగరంలోని ఎల్‌బీనగర్‌లో ఫొటో ట్రేడ్ ఎక్స్ పో కార్యక్రమం జరుగుతున్నది. సంబంధిత వాల్‌పోస్టర్‌ను మంగళవారం మండల ఫొటో గ్రాఫర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి ఏర్పుల మల్లేశ్, సభ్యులు పెద్దిరాజు, శేఖర్ గౌడ్, సతీశ్ యాదవ్, యాదగిరి, చిందం రఘుపతి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, నోముల మహేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## విదేశీ సీసాలు.. నాసిరకం మద్యం

**ముగ్గురిని అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు**

మాదాపూర్, అక్టోబర్ 3: ఈవెంట్‌లో దొరికిన విదేశీ ఖాళీ మద్యం సీసాల్లో చౌకగా లభించే స్థానిక మద్యం నింపి విక్రయిస్తున్న ముగ్గురిని శేరిలింగంపల్లి ఎక్సైజ్ శాఖ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. విదేశీ మద్యం పేరుతో నకిలీ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చింది. దీంతో నిఘా పెట్టాం. ఒడిశాకు చెందిన ఎండీ ఆజాం (30) విదేశీ మద్యం బాటిళ్లను బైక్‌పై రవాణా చేస్తూ.. సరఫరా చేస్తున్నాడని తెలిసింది. దీంతో మాదాపూర్‌లోని మెట్రో పిల్లర్ నంబర్ 1724, మెడ్ ప్లస్ మెడికల్ షాప్ వద్ద అతడిని అదుపులోకి తీసుకొని విచారించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. విచారణలో అతడు మాదాపూర్ సమీపంలో ఉంటున్నట్లు చెప్పాడు. అతడి ఇంట్లో సోదాలు చేయగా 22 విదేశీ మద్యం బాటిళ్లు దొరికాయి. ఇదిలా ఉండగా.. తదుపరి విచారణలో సుశాంత్ మల్లిక్‌తో పాటు అతడి అసిస్టెంట్ సత్యసుందర్ వద్ద పెద్ద మొత్తంలో మద్యం సీసాలు ఉన్నట్లు విచారణలో తేలింది. దీంతో పోలీసులు సుషాంత్ మల్లిక్ (35)తో పాటు సత్యసుందర్ (32) ఇళ్లల్లో కూడా సోదాలు చేసి, 22 విదేశీ మద్యం సీసాలు, 294 ఖాళీ మద్యం సీసాలు, 500 ఖాళీ సీసా క్యాపులు, కవర్లు, లేబుల్స్ స్వాధీనం చేసుకున్నారు. అందులో 46 విదేశీ బాటిళ్లలో సాధారణ మద్యం నింపి.. విక్రయించేందుకు సిద్ధం చేశారు. 294 ఖాళీ బాటిళ్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ డి. ప్రవీణ్ కుమార్, ఎక్సైజ్ శాఖ ఎస్‌హెచ్‌ఓ, ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్, డీటీఎఫ్ ఎస్సై జి.శ్రీకాంత్ రెడ్డి, ఎన్.శ్రీనివాస్‌తో పాటు ఎస్సైలు శ్రీనివాస్, వీరబాబు సిబ్బంది యాదయ్య, ఫక్రుద్దీన్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

# అల్లరి




### చెప్పుకోండి



1. భూమికి అత్యంత సమీపంలో ఉన్న గ్రహం ఏది?
2. 1857లో సిపాయిల తిరుగుబాటు ఎక్కడ ప్రారంభమైంది?
3. అక్షాంశాలు, రేఖాంశాల్లో ఏవి కాలాన్ని సూచిస్తాయి?

### కథ

## దొంగ దొరికిండు

**ఒక** ఊళ్లో ఇద్దరు వ్యాపారులు ఉండేవాళ్లు. వారిలో రహీం నూనెలు అమ్మేవాడు. సలీం కిరాణా సరుకులు, కూరగాయలు అమ్మేవాడు. వీళ్లు మొదట్లో మంచి స్నేహితులు. పక్కపక్కనే పోటీపడి వ్యాపారం చేస్తుండటంతో.. ఇప్పుడు ఇద్దరికీ క్షణం పడటంలేదు. ఒకరు మరొకరిపై గుర్రుగా ఉంటున్నారు. ఒకసారి పెద్ద గొడవ అయింది. ఎవరికి వాళ్లే ఊళ్లో పెద్దమనిషి దగ్గర ఫిర్యాదు చేశారు. ''నేను నూనె అమ్ముకుంటుంటే.. ఈ సలీం వచ్చి నన్ను మాటల్లో పెట్టిండు. నేను ఇంట్లోకి పోయి వచ్చే సరికి.. నా గల్లపెట్టెలో పైసల మూటను మాయం చేసిండు. పైసాపైసా కూడపెట్టుకున్న సొమ్ము అది. దయచేసి నాకు న్యాయం చేయండి!'' అని రహీం పెద్దమనిషితో మొరపెట్టుకున్నాడు. అంతా విన్న తర్వాత పెద్దమనిషి.. ''ఇదంతా నిజమేనా!?'' అని సలీంను అడిగాడు. ''లేదు లేదు! ఆ పైసల మూల్లె నిజంగా నాదే!'' అన్నాడు సలీం. ఇద్దరి వాదనా విన్నాక పెద్దమనిషి ఒక పరీక్ష పెట్టాడు. ఓ పళ్లెంలో నీళ్లు తెప్పించి, మూట విప్పి పైసలన్నీ అందులో పోశాడు. కొద్ది సేపటి తర్వాత ఆ పెద్దమనిషి సలీంను దొంగగా నిర్ధారించాడు. ''అసలు దొంగ నువ్వే! నీకు రెండు వందల రూపాయల జరిమానా విధిస్తున్నా!'' అని చెప్పి, పైసల మూటను రహీంకు అప్పగించాడు. అప్పుడు లబోదిబో మంటూ.. ''తప్పయింది. క్షమించండి!'' అని వేడుకున్నాడు సలీం. అయితే, సలీమే దొంగ అని పెద్దమనిషి ఎలా కనిపెట్టాడో అక్కడ ఉన్నవాళ్లకు అర్థం కాలేదు. అది గమనించిన పెద్దమనిషి.. ''ఈ పైసలను నూనె దుకాణం నడిపే రహీమే పైసాపైసా కూడబెట్టాడు. అందుకే, వీటిని పళ్లెంలోని నీళ్లలో పోయగానే.. పైసలకంటిన నూనె నీళ్ల మీద తేలింది!'' అని అసలు విషయం వివరించాడు.

**• కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి**



### పదస్పష్టి



కింద ఇచ్చిన పదంలోని అక్షరాల సాయంతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

Problem

Ex : Role

### టంగ్ ట్విస్టర్స్



Brisk brave brigadiers brandished broad bright blades, blunderbusses, and bludgeons balancing them badly.

### జవాబులు

(తలకిందులుగా ముద్రించబడింది)

జవాబులు : 1. శుక్రుడు, 2. మీరట్, 3. భూగోళం

ఆ పదమేంటి? : STAR

### స్నేహమంటే

**ఇచ్చింది** మరిచిపోవడం, పుచ్చుకున్నది జ్ఞాపకం ఉంచుకోవడమే.. నిజమైన స్నేహం.

**• మహాత్మా గాంధీ**

### లిటిల్ హ్యాండ్స్




**డి. నితిన్,** కాట్రియాల



పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం.

మా చిరునామా: zindagi@ntnews.com

### ఆ పదమేంటి?



| | | | |
|---|---|---|---|
| R | | T | |
| | S | | A |

ఇచ్చిన ఆధారాలను బట్టి సరైన పదాన్ని కనుక్కోండి.

### జతచేయండి

కింది బొమ్మలను వాటి సరైన నీడలతో జతచేయండి.

